కడుపు తీపి

శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

"బస్తీలో వుద్యోగం. ఎన్నాళ్లు హోటల్లో పడి అఘోరిస్తాడు. పూటకూళ్ల తిండి పడుతుందా చేస్తుందా. ఇంతే పెళ్లిపెటాకులు అంటూచేస్తే వాళ్ళ కాపరం వాళ్లు చేసుకుంటారు అని, ఆ రోజుల్లో జబ్బుమనిషి అని వాడుకపడింది అందువలన సంబంధాలుయేమి యెక్కిరాల. చచ్చిస్వర్గానవున్నాడు మా అన్నయ్యను బ్రతిమాలి, ఎంతైనా తల్లితోడుకద, ఆ మేనరికం కాస్త చేశా. ఇల్లుదొరకేట్లు లేదని వుత్తరాలు వ్రాస్తే, చచ్చినట్టు నేను వెళ్ళి అక్కడ యిక్కడ బ్రతిమాలి రెండుగదులు కుదిర్చివచ్చా. వస్తేను— ముందరే అద్దెడబ్బు కట్టాలన్నారు ఆరునెలలకు. ఆ కాసులపేరు కాస్త అమ్మి, మాకు మిగిల్చింది అదేగా. మిగతాదంతా వారి అప్పులకే సరిపోయింది కాదమ్మ. ఆ అద్దెడబ్బు కాస్త కట్టేశా. క్రొత్త కాపరం ఏం వెలగపెటతారో బస్తీలో అని, మా ముసలమ్మను కూడ పంపా వాళ్ళతో. ఇట్టేవారం గడిచిందో లేదో ముసలమ్మకు జబ్బుగావుందని వుత్తరం. అప్పుడప్పుడే నురుగులు కక్కుకుంటూ వెళ్లా. నేను వెళ్ళేటప్పటికి కోడలమ్మ మంచంమీద పడుకుంది—ఆ రాత్రినుంచి తలకాయ నొప్పిట. ముసలమ్మ మూలుగుతూ ఓ మూల పడుకుంది. అబ్బాయికేమో ఆఫీసు. పిలిస్తే పలికే దిక్కులేదు. ఇదేమన్నా మనవూరా యెవరోకరు వచ్చి యింతవుడకేసి పెట్టేందుకు. తల్లిఅన్న తర్వాత తప్పుతుందా? వాడు యివ్వాళ నువ్వేమి చేశావు అని అడిగాడు కాని! రాయంటిబిడ్డ, లక్క అంటి తల్లి అని చచ్చినట్టు వాళ్ళిద్దరుకు వుపచారంచేస్తూ అట్లా వారంరోజులు గడిపా. ముసలమ్మ కొంచెం కోలుకుందికదా అని యిట్టే యింటికివస్తే మళ్ళీ వెంటనే టెలిగ్రాం ముసలమ్మ చచ్చిందని. అదేమి శతృత్వమో నేను అక్కడ వున్నంతవరకూ బాగానే వుంది. మళ్లా ఆ బండిలోనే వెళ్ళా. ఎవరికోసం! అంతచెయ్యబట్టే యివ్వాళ యిట్లా అంటున్నాడు. ఇక ఆ యిల్లు చూడాలి పగవాళ్లకుకూడ వద్దమ్మ ఆ బాధలు. ఆ గదిలోనే పోయింది. నక్షత్రము మంచిది కాదు పాడుపెట్టాలన్నారు. వాణ్ణి హోటల్లో ప్రవేశించమనిచెప్పి, కోడలను యింటికి తీసుకొచ్చా. ఇన్ని విధాల కష్టపడ్డానమ్మ. నాకు యింకెవరున్నారు యీ కొడుకు కోడలేగదా అని. ఇంతచేశానే తల్లి అనే విశ్వాసం యేమైనావుందీ వాడికి కించిత్తయినా. ఇప్పుడు చిల్లిగవ్వకు పనికిరాకుండాపోయినాను. వారు ఆ నాడు భద్రాద్రి వెళ్లుతూ అన్నమాటలు యీ నాడిలాగ వుంటాయి. "తాతగారి తద్దినము వస్తోంది. వూళ్ళో బ్రాహ్మణులకు చెప్పిపోతున్నాను. మినపపప్పు, పెసరపప్పు తయారుచెయ్యి. తద్దినము రెండుమూడురోజులు వుందనగానే వస్తాన్లే. ఇల్లు జాగ్రత్త. నేను వెళుతున్నా" అన్నారు. తర్వాత తద్దినానికి రాకపోతే నాకు అనుమానంవేసింది. నెల రోజులకు "ఇంకేముంది అత్తా కొంప మునిగింది, మామయ్యను కొట్టి చంపారు భద్రాద్రిదార్లో." అని మా మేనల్లుడువచ్చి చెప్పేటప్పటికి నిలువునా కూలబడిపోయినా. అప్పటికి రాజశేఖరం నాలుగు నెలల వాడు. నాలుగునెలల దగ్గరనుంచి, మొగుడుపోయాడనే దుఃఖంలో యెన్ని కష్టాలు పడ్డానో, యెంత చాకిరిచేశానో ఆ భగవంతునికెరిక. కొంతకాకపోతే కొంతైనా ఆ దుర్గమ్మకు తెలుసు. ఈ నాటికి కొడుకు, కోడలు, మనమలు, మనమరాళ్లు అంటూ యేర్పడితే నేను దమ్మిడీకి పనికిరాకుండాపోయినా. వచ్చిన కష్టము రానేవచ్చింది. ఇప్పుడు వీళ్లను చూశన్నా సంతోషిద్దామనుకుంటే యిట్లా తయారయ్యాడు. ఇక నాజీవితానికి సుఖం యేముంటుంది అంటూ తన గోడంతా ప్రక్కయింటావిడతో యేకరువుపెట్టింది కావమ్మ.

ఇంతలో నాన్నవస్తున్నాడు అని సుభద్ర వాకిట్లోనుంచి గభాలునవచ్చి చెప్పటంలో కాలు మెలికపడి క్రిందపడింది. కొంచెం నెత్తురుకూడ వచ్చింది. కావమ్మ, మనుమరాలిని లేవదీయటానికి వెళ్ళితే 'నువ్వేమి చెయ్యక్కర్లేదులే' అని కసురుకుంటూ రిక్షాలో యెక్కించి తీసుకుపోయాడు రాజ

శేఖరం కూతుర్ని. కావమ్మ దుఃఖాన్ని ఆపుకో లేక గదిలోకివెళ్లి ఓ చాపమీదపడుకుంది. కోడలు యెంత బ్రతిమాలినా అన్నంతినలా ఆనాడు. అత్త గారంటె అమితప్రేమ భరణికి అందులో మేనత్తేను, పాపం యేంచేస్తుంది. మొగుణ్ణి యెదిరించి నెగ్గగలదా తల్లే నెగ్గలేకపోతే! 'అత్తయ్య అన్నంతినటంలేదు, మీరు చెపితేగాని తినరుట' అని పెళ్ళాం అంటే పట్టుబలవంతంమీద 'ఏమిటమ్మా అన్నం తినటం లేదుట; యిదెక్కడ గొడవ. నీకు కావాలసింది చేసిపెట్టుతుంది తిను. ఏయ్, నువ్వు సరిగ్గా చెయ్యటం లేదా' అని పెళ్లాంవైపు తిరిగి అన్నాడు రాజ శేఖరం. ఆ మాటలు వినంగానే గభాలునలేచి, ఆ మాటలతో కడుపునింపుకొని, కొడుకు దగ్గరకువచ్చి కూర్చుంది కావమ్మ. తాత్కాలికంగా రాజశేఖరం మనస్సుకరిగినట్లనిపించింది. భరణిముఖం చేటంత అయింది.

కావమ్మ మళ్లీ రాజశేఖరంతో మొదలు పెట్టింది. 'దేవుని దయవల్ల సుభద్రకు పన్నెండేళ్లు వచ్చినాయి. పెళ్లిచేస్తే నేనుచూసి సంతోషిస్తా. నేను పెద్దదాన్ని అయినానా' అంది.

'పిల్లల విషయం యెత్తొద్దని నీకు అనేకసార్లు చెప్పాను. ఇది ఆఖరిసారి చెప్పటం. నీకు కావల సింది యింత అన్నం. ఆ అన్నం కాస్తతినిపడివుండు. అంతేకాని అదిచెయ్యి యిదిచెయ్యి అని నువ్వేమి చెప్పక్కర్లేదు. మొన్న పారిజాతను బళ్లోకి వెళ్లద్దన్నావుటగదా అది లెఖలు చెయ్యలేదు. నీ మూలాన పిల్లలు చెడిపోతున్నారు. పిల్లలజోలి నీకేమి అక్కర్లేదు. వాళ్ల బాగోగులునావి. ఎట్లా చెయ్యాలో నాకు తెలుసులే' అంటూ మామూలు ధోరణిలోనే కసురుకున్నాడు రాజశేఖరం తల్లిని.

ఈ సారి కావమ్మకు పట్టరాని కోపము, అహం కారము వచ్చింది. ఇక వూరుకోలేకపోయింది. "పిల్లల్ని చెడకొట్టావు పిల్లల్ని చెడకొట్టావు అనిచాలా సార్లు అంటున్నావు. నీ పిల్లలు అంత ముద్దైతే నెత్తిన యెక్కించుకో యెవరికిపట్టింది. నన్ను ఆజ్ఞలో పెట్ట టానికి నువ్వెవడివి. మనిద్దర్ని ఆజ్ఞలో పెట్టేవాళ్లు పోనేపోయారు. నా ఆజ్ఞ నీకే లేకపోతే, నీ ఆజ్ఞ నాకేమిటి? గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించినట్లు - ఛీ! అవతలకుపో!" అని చకచక గదిలోకిపోతుంటే చేతిలో వున్న గ్లాసును విసిరివేశాడు "నాయింట్లోనుంచి వెళ్లిపో" అంటూ రాజశేఖరం తల్లిమీద. అయ్యో అంటూ తటాలున భరణి అడ్డం వచ్చింది. ఆ గ్లాసు దెబ్బ భరణి ముఖాన తగిలింది. పెద్దబొప్పె కట్టింది. ఆ బొప్పెను చేతితోరాకి, 'అయ్యో యింత దెబ్బ అత్తయ్యకి తగిలేదే నేను అడ్డం రాకపోతే' అని అత్తయ్యను కౌగలించుకొని యేడ్చింది. 'నువ్వెం దుకు అడ్డంవచ్చావు అమ్మ, ఆ దెబ్బ నాకు తగిలితే వాడి కళన్నా తీరేది' అని కన్నీరు కార్చింది కావమ్మ, కోడలి జుట్టు నిమురుతూ. ఓ మూల తల్లికి దెబ్బ, తండ్రి కోపంగా వుండటం, మామ్మ విచారం చూసి అప్పుడే బళ్లోంచివచ్చిన సుభద్ర బావురుమంది. అక్కయ్య వెంబడి యింట్లో నలుగురు పిల్లలు శృతి పట్టారు. కొంపంతా రోదనము. 'ఈ కొంపలో నేను వుండలేను మీరే వుండండి' అంటూ రాజశేఖరం చివాలునలేచి వుత్తరీయం బుజానవేసుకొని గడప దాటాడు. సుభద్ర 'నాన్నా! ఎక్కడికి?' అని కెవ్వున కేక పెట్టింది. నాన్న అనే సుభద్ర పిలుపు రాజశేఖరం చెవుల్లో మారుమ్రోగిపోయింది. ఆ శబ్దం, పెద్దబరువుగల ఓ రాయిని తన గుండెమీద నుంచి తీసినట్లనిపించింది. ఆ నాన్న అనే అమాయకపు పిలుపులో తన హృదయము చిగిర్చి పుష్పించి, ఫలోన్ముఖం అయింది. ఆ పిలుపు తన పితృత్వాన్ని పులకరింపచేసింది. ఆ నాన్న అనే శబ్దతరంగాలు తన ప్రతివక్కనాడిలో ఓలలాడి, గుండెదగ్గర యేదో రహస్యము చెప్పినట్లనిపించినాయి. ఆ నాన్న అనే శబ్దం తన ముందు ఒక పెద్ద అఖాతము త్రవ్వింది. ముందుకు వెళ్లటానికి వీల్లేదు. ఆ నాన్న అనే శబ్దంలో ఓ అనంతమైన వెలుగు ప్రస్ఫుటంగా గోచరిస్తోంది. తన నాలిక యెక్కువసేపు మౌనం వహించలేకపోయింది. అమ్మా అని ఓ వెర్రికేక వేసింది. తన హృదయాన్ని యిన్నాళ్లనుంచి ఆవరించిన తమస్సు యివ్వాళ తొలగినట్లనిపించింది. చీకటి

పోంగానే వెలుగు. ఆ వెలుగులో నల్లటి అక్షరాల్తో వున్నట్లు ఓ వాక్యము హృదయానికి స్ఫురించింది. 'సుభద్ర నీ కెంతో, నువ్వు నీ తల్లికి అంతకావా' అనే ఆ వాక్యాన్ని కన్నీటిధారతో చదివాడు. 'అమ్మా' అంటూ కావమ్మ కాళ్లమీదవచ్చిపడ్డాడు. క్షమించు అనేమాట అనటానికికూడ సిగ్గుపడుతోంది హృదయము. కావమ్మ వణుకుతూనే నాయనా అంది. 'నా యీ పాపపుకళ్ళు నీ ముఖం చూడలేవు. నేను చేసిన ప్రతి అపచారము క్షమించానంటేనే తలెత్తేది.' లేకపోతేలేదు' అన్నాడు పట్టి బిగువున. "నువ్వు చేసిందేముంది నిన్ను క్షమించటానికి - చిన్నతనం నాయనా తెలీదు. పెద్దదాన్ని నేను చెపుతున్నాగా లేనాయనా లే" అంటూ తన మాతృత్వాన్ని రాజశేఖరం హృదయంలో వెదజల్లింది. రెండుచేతులు పట్టుకొని లేవదీసింది. ముప్పయి యేండ్లకు మళ్లీ అమ్మఒళ్లో రాజశేఖరం కూర్చున్నాడు.

జుట్టు నిమురుతూ "నీ సుఖమే నాసుఖం, మీ నలుగుర్ని చూసి సంతోషించటంకంటే నాకు యింకే ముంది. మీకంటే నాకు యింకెవరున్నారని! నువ్వు మాత్రం సుఖపడిందేముంది. నువ్వు సుఖపడకపోతే నాకు సుఖం వుంటుందా" నీ యేవేవో చెపుతోంది తల్లి. అమ్మ అని ఒక్కటేమాట వస్తోంది రాజశేఖరం నోట్లోనుంచి.

నాన్న అని సుభద్ర, పారిజాతవచ్చారు "మీ అమ్మవళ్లో! నువ్వు కూర్చున్నావుగా అనీ వళ్లో మేము కూర్చుంటాం"మంటూ. 'రండి' అంటూ రెండుచేతులు జాపాడు. ధరణి ఆనందభాష్పాలు ఆస్మితపదానికి వన్నె తెచ్చినాయి.

రీటా హెయిర్ టానిక్

రీటా కురుళ్ళకు బలమునిచ్చి నిగనిగలాడు నిడుపాటికురులను పెంచే అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెంట్రుకలు రాలుట, చుండు, బట్టతల మొదలైన కురుల వ్యాధులకు రీటా అమోఘమైనది. మీరుకూడ నేటి నుండియే రీటా వాడుడు. ప్రతిచోటా దొరుకును.

RITA

HAIR TONIC